



టైక్వాండో జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొన్న గంగవరం కేజీబీవి టెన్త్ విద్యార్థిని చందనకు జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్ - సమాచార శాఖ డీడీ పద్మజకు కలెక్టర్ సుమిత్‌కుమార్ సత్కారం



చిత్తూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో మహిళా దినోత్సవ సంబరాలు

మీ కీర్తి.. మరెందరికో స్ఫూర్తి



కార్వేటినగరం వెలుగు కార్యాలయంలో సభ్యులతో కలిసి కేకు కట్ చేస్తున్న ఏపీఎం కవిత



పలమనేరులో నిర్వహించిన మహిళా దినోత్సవంలో భరతనాట్య ప్రదర్శన

అవరోధాలను అధిగమించి ముందడుగు వేసున్న మహిళకు నీరాజనాలు పట్టారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ ప్రగతిపథాన సాగుతూ పదుగురికీ స్ఫూర్తినిస్తున్న అతివలను సత్కరించారు. జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాలు ఇందుకు వేదికయ్యాయి. ఊరూవాడా ఘనంగా జరిగిన ఈ వేడుకల్లో అధికారులు,నాయకులు ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. వివిధ రంగాల్లో విజయాలను నమోదు చేసుకున్నవారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. మరింత పురోగతి సాధించేలా డ్వాక్రా సంఘాల సభ్యులకు రుణాలను పంపిణీ చేశారు.



కుప్పంలో జరిగిన మహిళా దినోత్సవంలో శాంతిపురం మండలానికి చెందిన మిస్ యూనివర్స్ ఏపీ చందన జయరాం ప్రసంగం

లోక్ అదాలత్ తీర్పుపై

అప్పీల్‌కు అవకాశం లేదు

● జిల్లా జడ్జి భీమారావు



కక్షిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న జిల్లా జడ్జి భీమారావు

చిత్తూరు లీగల్, మార్చి8(ఆంధ్రజ్యోతి):వయసు పెరిగే కొద్దీ అనుభవంతో పాటు ఆలోచన విధానంలో మార్పు వస్తేనే సమాజం బాగుంటుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ. భీమారావు చెప్పారు.ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఉన్న కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం శనివారం జరిగింది. చిత్తూరు లోక్ అదాలత్ కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలోని 13 కోర్టుల పరిధిలో లోక్ అదాలత్ కోసం 32 బెంచీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. లోక్ అదాలత్ ఇచ్చిన తీర్పు అంతిమ తీర్పు అన్న ఆయన దానిపై అప్పీల్‌కు వెళ్ళడానికి అవకాశం లేదన్నారు.కుటుంబాల మధ్య ఐకమత్యం లేకపోవడంతో చిన్న చిన్న గొడవలు వస్తుంటాయని, అలాంటి సమయంలో క్షణికావేశానికి గురై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని కోరారు. డీఎల్ఎస్ఏ సెక్రటరి, సీనియర్ సివిల్ జడ్జి యం.ఎస్. భారతి, ఒకటవ అదనపు జిల్లా న్యాయమూర్తి రమేష్, ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి బాబునాయక్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు శంకరనాయుడు, సెక్రటరీ సురేష్ రెడ్డి, న్యాయమూర్తులు యంవీఎస్ పద్మజ, వెన్నెల, మాధవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో 8201 కేసులు పరిష్కారం

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఉన్న కోర్టుల్లో శనివారం జరిగిన లోక్ అదాలత్ కార్యక్రమాల్లో 8201 కేసులు పరిష్కారమయ్యాయి.చిత్తూరులో 2905 కేసులు, తిరుపతిలో 2251, పుత్తూరులో 807,పలమనేరులో 428,శ్రీకాళహస్తిలో 285, కుప్పంలో 269, సత్యవేడులో 230, పుంగనూరులో 224, నగరిలో 184,మదనపల్లెలో 163, తంబళ్లపల్లెలో 150,వాయల్పాడులో 134, పీలేరులో 89, పాకాలలో 82 కేసులు పరిష్కారమయ్యాయి.విడాకుల కోసం కోర్టుకెక్కిన ఒక జంట పుత్తూరు లోక్ అదాలత్‌లో తిరిగి ఒక్కటయ్యారు.విడాకులు కోరుతూ కోర్టుకెక్కిన నారాయణవనానికి చెందిన గురుచరణ్, పుత్తూరు ఎన్జీవో కాలనీకి చెందిన పద్మప్రియ దంపతులు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర మంచిమాటలతో మనసు మార్చుకున్నారు. శనివారం ఆయన సమక్షంలోనే పూలదండలు మార్చుకుని కలసి ఇంటికి వెళ్లడం విశేషం.

జనసేన నేత కిరణ్‌రాయల్‌పై కేసు కొట్టివేత

- లోక్ అదాలత్‌లో రాజీ పడ్డ లక్ష్మి -

తిరుపతి(నేరవిభాగం), మార్చి 8(ఆంధ్రజ్యోతి): జనసేన నేత కిరణ్‌రాయల్‌పై ఇటీవల నమోదైన కేసును లోక్ అదాలత్‌లో కొట్టి వేస్తూ తీర్పు చెప్పారు. తన వద్ద డబ్బులు తీసుకుని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని ఆరోపిస్తూ తిరుపతికే చెందిన లక్ష్మీరెడ్డి అనే మహిళ ఎస్వీ యూనివర్శిటీ పోలీసుస్టేషన్‌లో కిరణ్‌రాయల్‌పై ఫిర్యాదు చేయడంతో ఈ కేసు నమోదయ్యింది.ఈ కేసుకు సంబంధించిన కొన్ని వీడియోలను సైతం ఆమె రిలీజ్ చేయడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.కిరణ్‌ను జనసేన వ్యవహారాలకు దూరంగా వుండాలని ఆదేశాలు జారీ అయ్యాయి.ఈ క్రమంలో శనివారం తిరుపతిలో జరిగిన లోక్ అదాలత్‌కు వారు హాజరయ్యారు.ఇద్దరినీ న్యాయమూర్తి విచారించాక రాజీపోవడంతో కిరణ్‌పై నమోదైన కేసును కొట్టి వేస్తూ తీర్పు చెప్పారు.

వెటర్నరీ విద్యార్థినుల వినూత్న నిరసన

తిరుపతి రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఈ క్రమంలో మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం వర్సిటీ ప్రధానగేటు ఎదురుగా విద్యార్థినులంతా నల్లదుస్తులు ధరించి, నోటికి నల్లమాస్కులు పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు.హ్యాపీ వుమెన్స్ డే తమకు లేదంటూ చేతులకు నల్లరంగు పూసుకుని తెలుపురంగు ఆంగ్ల అక్షరాలలో సేవ్ వెట్స్ అంటూ ప్రదర్శన ఇచ్చారు. సమానత్వం, న్యాయం, గౌరవం లభించేవరకు సమ్మె కొనసాగిస్తామన్నారు.



నల్ల దుస్తులు ధరించి నోటికి నల్ల మాస్క్‌తో నిరసన వ్యక్తం చేస్తున్న వెటర్నరీ విద్యార్థినులు

అమ్మభాష కళ్ల వంటిది..

● ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

అన్య భాషలు కళ్ల జోళ్ల లాంటివి



సమావేశంలో ప్రసంగిస్తున్న దగ్గుబాటి పురందేశ్వరి

చిత్తూరు సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అమ్మభాష మన కళ్ల వంటిది.. ఇతర భాషలు కళ్ల జోళ్ల లాంటివని రాజమహేంద్రవరం ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. కంటిచూపు ఉంటేనే కళ్లద్దాలు పనిచేస్తాయని, అందువల్ల మాతృభాషను మరవకూడదని చెప్పారు. అదే సమయంలో ఇతర భాషలను సైతం నేర్చుకోవాలన్నారు. శనివారం చిత్తూరులోని ఎస్పీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల 43వ వార్షికోత్సవం, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ.. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా ఉన్నారన్నారు. ఒక దేశ స్థితిని తెలుసుకోవాలంటే అక్కడి మహిళల అభివృద్ధి తెలుసుకుంటే చాలని స్వామి వివేకానంద అన్నారని వివరించారు. మాజీ ఎమ్మెల్యే, కళాశాల సీపీడీసీ సెక్రటరీ వెంకటేశ్వర చౌదరి మాట్లాడుతూ.. పురందేశ్వరి వంటి గొప్ప మహిళా నాయకురాళ్ల కళాశాలకు రావడం విద్యార్థినులకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ మాట్లాడుతూ.. ఒక స్త్రీ కుటుంబానికి అత్యంత ప్రాధాన్యమైన వ్యక్తి అన్నారు. చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత మాట్లాడుతూ.. మహిళలు బాగా చదువుకుంటే ఎంత ఉన్నత పదవినైనా అందుకోగలరన్నారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు ఎస్పీ సావిత్రమ్మ గోల్డ్ మెడల్స్‌ను ఎంపీ ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మనోహర్, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో ఎస్ఆర్ డాక్టర్ల పోస్టులకు 14న ఇంటర్వ్యూ

తిరుపతి(వైద్యం), మార్చి 8(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో సీనియర్ రెసిడెంట్ డాక్టర్ల (అడహక్ బేసిక్ పద్ధతిన) పోస్టులకు ఈ నెల 14న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు స్విమ్స్ రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్విమ్స్ యూనివర్సిటీ పరిధిలో అన్నివిభాగాలకు సంబంధించి 38 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ నెల 14న శుక్రవారం ఉదయం 10.30 గంటలకు పాత డైరెక్టర్ కార్యాలయ కమిటీ హాల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని వివరించారు. హిందూ మతానికి చెందిన వారు మాత్రమే ఈ ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆమె వివరించారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆదివారం) : 6.28

సహరి (సోమవారం) : 5.04

జిల్లా కేంద్రానికి టెన్త్ ప్రశ్నపత్రాలు

చిత్తూరు సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ప్రశ్నపత్రాలు శనివారం జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. డీఈవో కార్యాలయం పక్కన ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని స్ట్రాంగ్ రూంలో జిల్లా రెవెన్యూ అధికారి మోహన్, డీఈవో వరలక్ష్మి.. పోలీసు బందోబస్తు మధ్య ప్రశ్నపత్రాలను భద్రపరిచారు. అనంతరం పటిష్ట బందోబస్తు మధ్య పరీక్ష కేంద్రాలకు సమీపంలోని పోలీస్ స్టేషన్లకు వీటిని తరలించారు.

ఐరాలలో గజదాడులు



35యర్లంపల్లెలో ఏనుగులు తొక్కేసిన వరి పంట

ఐరాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండలం 35యర్లంపల్లె, దివిటివారిపల్లెల్లో పంటలపై రెండు ఏనుగులు శుక్రవారం రాత్రి దాడి చేశాయి. దివిటివారిపల్లెకు చెందిన మునికృష్ణ, రెడ్డెప్ప, 35యర్లంపల్లెకు చెందిన రవికుమార్‌కు చెందిన వరిపంట, 35యర్లంపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యంయాదవ్‌కు చెందిన మామిడితోటలో కొమ్మలు విరిచి, సపోట, అరటి పంటను తొక్కి నాశనం చేశాయి. మామిడి తోటకు అమర్చిన ఇనుప గేటును, కంచె కూసాలను విరిచేశాయి. సమాచారం అందుకున్న ఫారెస్టు బీట్ అధికారి రెడ్డిప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని టపాకాయలు పేల్చి ఏనుగులను సరకల్లు అటవీప్రాంతంలోకి తరిమివేశారు. ప్రస్తుతానికి ఏనుగులు సరకల్లు అటవీప్రాంతంలో ఉన్నట్లు సమాచారం.

మహిళల కోసం అవని డిపాజిట్ పథకం

● రూ.42 కోట్ల సేకరణే లక్ష్యం : డీసీసీబీ సీఈవో

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళల కోసమే అవని డిపాజిట్ పథకాన్ని శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రారంభించినట్లు డీసీసీబీ సీఈవో శంకర్‌బాబు తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 37 డీసీసీబీ శాఖలు, 75 సింగిల్‌విండోల ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈనెల 31వ తేదీవరకు డిపాజిట్ల సేకరణ జరుగుతుందని, రూ.10వేలు లేదా అంతకుపైబడి డిపాజిట్ చేయవచ్చన్నారు. ఈ పథకం కింద రూ.42కోట్లు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలియజేశారు. 333 రోజుల కాలపరిమితితో 8.30 శాతం వడ్డీ ఇస్తారన్నారని, సీనియర్ సిటిజన్లకు 8.40 శాతం వడ్డీ చెల్లిస్తామని వివరించారు. వివరాలకు సమీప బ్యాంకు బ్రాంచిల్లో సంప్రదించాలని సూచించారు.



శంకర్‌బాబు

గుప్తనిధుల కోసం తవ్వకాలు

● సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సహా ఐదుగురి అరెస్టు



ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు



సంఘటనా స్థలంలో నిందితులు

రామకుప్పం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం సింగసముద్రం పంచాయతీ జీడిమాకులపల్లె సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి గుప్తనిధుల కోసం చేపట్టిన తవ్వకాలు కలకలం సృష్టించాయి. పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు.. జీడిమాకులపల్లెలోని సువర్ణకుంట వద్ద పురాతన రాతి మండపంలో అమ్మవారి శిలాఫలకం ఉంది. పూర్వం గ్రామస్తులు అమ్మవారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించి తమ పశువులను అక్కడకు తీసుకెళ్లి ఎలాంటి వ్యాధులు రాకుండా పూజలు చేసేవారు.అమ్మవారి మండపం కింద గుప్తనిధులున్నాయన్న పుకార్లను నమ్మిన చుట్టుపక్కల గ్రామాలకు చెందిన కొందరు యువకులు వాటిని దక్కించుకోవాలని నిర్ణయించుకున్నారు. కుప్పం మండలం దేవరాజపురానికి చెందిన కదిరివేలు(23), రాజశేఖర్(18), రామకుప్పం మండలం బల్లకు చెందిన సోమశేఖర్, భూమండలపురానికి చెందిన ఉపేంద్ర(27), కుప్పిగానిపల్లెకు చెందిన పాండ్యన్, ఎక్స్‌కవేటర్ యజమాని మునిరత్నం, బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్న కృష్ణాజిల్లాకు చెందిన శివనాగరాజేష్(35) గురువారం రాత్రి అమ్మవారి మండప రాతి పలకలను తొలగించి ధ్వంసం చేశారు. మళ్లీ శుక్రవారం రాత్రి మండపం కింది భాగంలో 15 అడుగుల మేర ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు చేపట్టారు.ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడకు వెళ్లి తవ్వకాలను అడ్డుకున్నారు. పోలీసులకు సమాచారమివ్వడంతో కదిరివేలు, రాజశేఖర్, సోమశేఖర్, ఉపేంద్ర, శివనాగరాజేష్‌లను అదుపులోకి తీసుకున్నారు. మునిరత్నం, పాండ్యన్ పరారయ్యారు. ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటమోహన్ తెలిపారు.



ఈమెను పట్టించుకునే వారేరీ?

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు సాధించిన విజయాలను వేనోళ్ల పొగిడారు. చిత్తూరు గాంధీ విగ్రహం కూడలిలో ఓ మతిస్థిమితం లేని మహిళ మూడు నెలలుగా ఎండకు ఎండుతూ.. చలికి వణుకుతూ దుర్భర జీవితాన్ని గడుపుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. మాట్లాడలేని స్థితిలో ఉన్న ఆమెకు ఎవరైనా ఇన్ని మెతుకులు పెడితే తింటోంది. లేదంటే పస్తే. ఈమెను నిరాశ్రయుల వసతి గృహంలో చేర్పించాలని స్థానికులు కోరుతున్నారు.

స్వామిత్వపై ఒక రోజు శిక్షణ



సమావేశంలో ప్రసంగిస్తున్న డీపీవో సుధాకర్‌రావు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో స్వామిత్వ నిర్వహణపై శనివారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డీపీవో సుధాకర్‌రావు మాట్లాడుతూ.. స్వామిత్వపై పక్కా అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పంచాయతీశాఖ విస్తరణాధికారులు, సర్వేశాఖ ఏడీ జయరామ్, ఈవోపీఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'కూటమి' ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి

అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్



సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రేమ

చిత్తూరు అర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రేమ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సంఘ కార్యాలయంలో ముఖ్య నేతలతో జరిగిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. వర్కర్ల వయో పరిమితిని 62 ఏళ్లకు పెంచడం హర్షణీయమన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన 44 రోజుల సమ్మెకాలానికి వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇపుడా హామీని అమలు చేయకపోగా, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లోనూ కోత విధించడం సరికాదన్నారు. ఇకనైనా ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

సారా కేసులో ముగ్గురి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

చిత్తూరు సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సారా కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు చిత్తూరు అర్బన్ ఎక్సైజ్ సీఐ శ్రీహరి రెడ్డి తెలిపారు. శనివారం గుడిపాల మండలం చిత్తపార గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో విస్తృతంగా దాడులు నిర్వహించామని చెప్పారు. ఈ దాడుల్లో సుమారు 700 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసి, 25 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. సారా తయారీకి బెల్లం సరఫరా చేసిన చిత్తపారకు చెందిన రామదాసు, తయారీకి పాల్పడిన వెంకటేష్, సారా విక్రయానికి పాల్పడిన ప్రభాకర్‌ను అరెస్టు చేశామని వివరించారు. ఈమేరకు నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలియజేశారు.

జానపద విజ్ఞాన సదస్సు ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత యూనివర్సిటీ వేదికగా చేపట్టిన మూడు రోజుల జానపద విజ్ఞాన సదస్సు శనివారం ప్రారంభమైంది. భారతీయ పురాణాలు, భారతీయ జానపద, గిరిజన విజ్ఞానం - తులనాత్మక పరిశీలన అంశంపై ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పలు ప్రాంతాల ప్రతినిధులు పరిశోధనా పత్రాలు సమర్పించారు. వీరికి సదస్సు సంచాలకులు డాక్టర్ డి. నల్లన్న ధ్రువీకరణ పత్రాలు అందజేసి సత్కరించారు.

ఘనంగా సైన్స్ డే



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

చిత్తూరు సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయిలో నేషనల్ సైన్స్ డేని శనివారం చిత్తూరు లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ప్రాథమిక పాఠశాల స్థాయి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఉన్నత పాఠశాల స్థాయిలో క్విజ్, ఒలంపియాడ్, సెమినార్ విభాగాల్లో పోటీలు జరిగాయి. గెలుపొందిన 30 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు.

ద్రావిడ వర్సిటీ శ్రీనివాస వనంలో మంటలు



ద్రావిడ వర్సిటీ శ్రీనివాసవనంలో అగ్నికి కాలుతున్న చెట్లు

గుడుపల్లె, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయం శ్రీనివాస వనానికి శనివారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. వర్సిటీ మెయిన్ గేటు ఎదుట ఇటీవల కొత్తగా నిర్మించిన క్లాస్‌రూమ్ కాంప్లెక్స్ భవనం సమీపంలోని దాదాపు 10 ఎకరాల్లో ఉన్న అకేషియా చెట్లు అగ్నికి కాలిపోయాయి. విషయం తెలుసుకొన్న విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ సిబ్బంది ట్యాంకర్లతో నీటిని తెప్పించారు. కంగుంది బాలుర హాస్టల్ విద్యార్థులు తోడు కావడంతో బిందెలు, బకెట్లతో గంట పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. 900 ఎకరాల్లో శ్రీనివాస వనం ఉండటంతో సమయానికి స్పందించి మంటలను అదుపుచేయకుంటే ఎక్కువ నష్టం జరిగేది.

మనోధైర్యంతో ముందుకెళ్లండి

మహిళా దినోత్సవంలో కలెక్టర్ పిలుపు



మహిళకు ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, వేదికపై మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ హేమలత తదితరులు

చిత్తూరు అర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా మనోధైర్యంతో ముందుకెళ్లాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో ఐసీడీఎస్, మెప్మా, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజ వికాసానికి, అభివృద్ధికి మహిళల పాత్ర కీలకమన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ.. ప్రతి కుటుంబంలో మహిళలు ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు.. మహిళాభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. మేయర్ అముద మాట్లాడుతూ.. ఆడపిల్లలు పుడితే బాధపడే స్థాయి నుంచి గర్వించే స్థాయికి వ చ్చామన్నారు. చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డీసీహెచ్ఎస్ ప్రభావతి, డీఎంహెచ్‌వో సుధారాణి మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు ముందుకు వెళుతున్నారన్నారు. ఈ సందర్భంగా డ్వాక్రా సంఘ గ్రూపులకు బ్యాంకు లింకేజీ కింద రూ. 97.72 కోట్లు, మెప్మా ద్వారా రూ.28.93 కోట్ల మెగా చెక్కులను కలెక్టర్ అందించారు. ఉత్తమ పనితీరు కనబరిచిన డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, సమాచారశాఖ డీడీ పద్మజ, డీఎంహెచ్‌వో, డీసీహెచ్ఎస్‌లతోపాటు పలువురు మహిళలను శాలువాలతో సత్కరించి, ప్రశంసాపత్రాలను అందించారు. మెప్మా పీడీ రవీంద్రబాబు, ఎస్ఎస్ ఏపీసీ వెంకటరమణ, జిల్లా సాంఘిక సంక్షేమ సంక్షేమాధికారి చెన్నయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

స్త్రీ లేకుంటే జననం, గమనం లేదు: ఎస్పీ



విద్యార్థినికి బహుమతి ప్రదానం చేస్తున్న ఎస్పీ మణికంఠ దంపతులు

చిత్తూరు అర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): స్త్రీ లేకుంటే జననం, గమనం లేదని ఎస్పీ మణికంఠ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పోలీసు కుటుంబాలు, మహిళా ఉద్యోగులకు పోలీసు వెల్ఫేర్ ఆస్పత్రిలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్పీ సతీమణి హర్షిత మాట్లాడుతూ.. ఉద్యోగినులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడానికి సమ్మతించిన టాటా క్యాన్సర్ ఆస్పత్రివారికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా విద్యార్థినులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలైన వారికి బహుమతులను ప్రదానం చేశారు. అలాగే ఈ ఏడాది విధి నిర్వహణలో ప్రతిభ చూపిన ఐదుగురు మహిళా అధికారులకు, సిబ్బందికి సర్టిఫికెట్లు, బహుమతులను అందించారు. మహిళా డీఎస్పీ విజయశేఖర్, ఎంటీవో భాస్కర్, సీఐలు జయరామయ్య, వాసంతి, ఆస్పత్రి డాక్టర్ లావణ్య, పోలీసు సంఘం అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.15 కోట్ల యూనిట్‌కు రూ.88కోట్ల రాయితీలిస్తారా?

పరిశ్రమల శాఖ అధికారులకు జీడీ నాయుడు ప్రశ్న



చిత్తూరు సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిశ్రమల శాఖలో పనిచేస్తున్న ఇద్దరు అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని న్యూ చిత్తూరు నోటిఫైడ్ ఇండస్ట్రియల్ ఏరియా సర్వీసెస్ సొసైటీ చైర్మన్ జీడీ నాయుడు విమర్శించారు. శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చిత్తూరు సమీపంలోని గ్రావిటీ ఇండియా లిమిటెడ్ యూనిట్.. తయారీ పరిశ్రమ కానప్పటికీ పారిశ్రామిక ప్రోత్సాహకాలను అందిస్తున్నారని తెలిపారు. రూ.15 కోట్ల యూనిట్‌కు జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు రూ.88 కోట్ల రాయితీ ఇచ్చారని ఆరోపించారు. వీరి అవినీతిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందని చెప్పారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి, గ్రావిటా యూనిట్‌కు మంజూరు చేసిన రాయితీని రికవరీ చేయాలన్నారు.

పారదర్శక భూపాలనే 'భూ ఆక్రమణ నిషేధ బిల్లు' లక్ష్యం

ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు



చిత్తూరు సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పారదర్శక భూ పాలనే 'భూ ఆక్రమణ నిషేధ బిల్లు-2024 ' లక్ష్యమని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో గ్రామీణ ప్రజల భూ హక్కులను కాపాడారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం సృష్టించిన గందరగోళానికి విప్లవాత్మక నిర్ణయంతో కూటమి ప్రభుత్వం తెరదించిందని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం భూ నిర్వహణ వ్యవస్థను విచ్ఛిన్నం చేసి, భూ దోపిడీకి తెరతీసిందన్నారు. భూమిని అసలైన వ్యక్తుల చేతుల్లో ఉండేలా చట్టాన్ని అమలు పరచడంలో సీఎంతోపాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సఫలీకృతులయ్యారని ఆ ప్రకటనలో వివరించారు.

తిరుమల ఘాట్ రోడ్ల మరమ్మతుపై మల్లగుల్లాలు

● త్వరలో నివేదిక సమర్పించనున్న ఐఐటీ నిపుణులు



సీసీ రోడ్డులోని పగుళ్లకు వేసిన తారు

తిరుమల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్ రోడ్ల మరమ్మతులపై టీటీడీ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. వాహనాల రద్దీ కారణంగా మరమ్మతులకు పూనుకోవడం ఇబ్బందిగా మారుతోందని చెబుతున్నారు. కొత్త సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తే రాకపోకలకు రెండవ ఘాట్ రోడ్డుపై ఆధారపడాలి. దీనివల్ల చాలా ఇబ్బంది కలుగుతుందని భావించి ఆరేడేళ్లుగా చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. ఈ క్రమంలో టీటీడీ అధికారులు ఇటీవల ఐఐటీ నిపుణుల బృందాన్ని సంప్రదించారు. కొన్ని రోజుల క్రితం నిపుణులు ఘాట్ రోడ్లను పరిశీలించారు. వారిచ్చే నివేదికను బట్టి తదుపరి చర్యలు చేపట్టనున్నారు.

రోడ్లలో భారీగా పగుళ్లు..

1940లో ఆనాటి మహంతులు మొదటి ఘాట్ రోడ్డు నిర్మించారు. మూడేళ్లలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రముఖ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఈ నిర్మాణంలో కీలకపాత్ర పోషించారు. 1974లో రెండవ ఘాట్ రోడ్డు నిర్మాణం జరిగే వరకు మొదటి ఘాట్ రోడ్డులోనే రాకపోకలు జరిగేవి. దీనికి అనుగుణంగానే అప్పటి అధికారులు 55 మలుపులతో నిర్మించారు. కాలానుగుణంగా మట్టి రోడ్డు సీసీ రోడ్డుగా, తారు రోడ్డుగా మారుతూ వచ్చింది. మలుపుల్లో సీసీ రోడ్డు, సాఫీగా ఉన్న చోట తారు రోడ్డు ఉంది. అయితే మలుపుల్లోని సీసీ రోడ్డు పగుళ్ల ఇబ్బందికరంగా మారాయి. చాలాచోట్ల పగుళ్లతో పాటు గుంతలు కూడా ఏర్పడ్డాయి. కొన్నిచోట్ల వాహనాలు వెళుతుంటే శబ్దాలు కూడా వస్తున్నాయి. ఈ క్రమంలో ప్రయాణం సాఫీగా సాగడంలేదు. టీటీడీ అడపాదడపా పగుళ్లకు తారుపూసి సరిపెడుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదు.



మెగా కార్పొరేట్ టీ-20 క్రికెట్ లీగ్ ప్రారంభం



టాస్ వేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కనే ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి(క్రీడలు), మార్చి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్వీ యూనివర్శిటీ మైదానంలో శనివారం మెగా కార్పొరేట్ టీ-20 క్రికెట్ లీగ్ సెవెన్త్ ఎడిషన్-2025ను కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అట్టహాసంగా ప్రారంభించారు. తొలిమ్యాచ్‌లో కలెక్టర్ లెవెన్ -ఎస్పీ లెవెన్ జట్లు తలపడ్డాయి. ఎస్పీ జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో అమరరాజ -సచివాలయం జట్లు తలపడగా అమరరాజ జట్టు విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమానికి చీఫ్ ఆర్గనైజర్‌గా చీర్ల కిరణ్ వ్యవహరించారు. ముఖ్యఅతిథులుగా పీపీ రాయలు, డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్, ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎం.శివశంకరరెడ్డి పాల్గొన్నారు. కాగా 10 కార్పొరేట్ జట్లు తలపడుతున్న ఈ టోర్నీ ఈనెల 19 తేదీ వరకు కొనసాగుతుంది. ప్రతి జట్టు లీగ్‌దశలో నాలుగు మ్యాచ్‌లు ఆడనుంది.

వైద్యానికి వచ్చి వీల్‌చైర్‌తో ఉడాయింపు

తిరిగి స్వాధీనానికి రుయా సిబ్బంది ఆపసోపాలు



తిరుపతి(వైద్యం), మార్చి 8(ఆంధ్రజ్యోతి): చికిత్స తర్వాత రోగి ఆస్పత్రి వీల్‌చైర్‌తో ఉడాయించిన వైనమిది. పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తి(అనంతపురం)ని వైద్యం కోసం కుటుంబ సభ్యులు శుక్రవారం రుయాస్పత్రికి తీసుకువచ్చారు. ఇతనికి అత్యవసర విభాగంలో వైద్య సేవలు అందించారు. అదేరోజు రాత్రి రోగితోపాటు సహాయకులు ఆస్పత్రికి చెందిన వీల్‌చైర్‌ను కూడా తీసుకుని రైలులో అనంతపురం బయల్దేరారు. పీలేరులో రుయాస్పత్రి ఉద్యోగి భర్త వెంకటాచలపతి ఇదే రైలు ఎక్కారు. రుయాస్పత్రి వీల్‌చైర్‌లో కూర్చొని వున్న రోగిని చూసి వెంటనే భార్యకు ఫోన్ చేశారు. ఫోటో తీసి పంపారు. ఆమె హెల్త్ సూపర్‌వైజర్ ప్రకాష్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రి అటెండరు అరుణ్‌ను అప్రమత్తం చేశారు. అరుణ్ వెంటనే రైల్వే స్టేషనుకు వెళ్లి వీల్‌చైర్ తీసుకుని దిగిన వారిని గుర్తించి ప్రశ్నించారు. రోగి సహాయకులు అతనితో వాగ్వాదానికి దిగారు.పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించడంతో వీల్‌చైర్‌ను అప్పగించారు. దానిని రుయాస్పత్రికి పంపేందుకు ఏర్పాట్లు చేశారు. స్పందించి సహకరించిన వారిని సూపరింటెండెంట్ రవిప్రభ అభినందించారు.

ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యానవన రైతులు ప్రభుత్వం అందజేస్తున్న రాయితీ పరికరాలను, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేరు ఆర్డీవో కార్యాలయం వద్ద పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని ఉద్యాన రైతులకు మామిడికి ప్రత్యామ్నాయంగా చేయదగిన పంటలపై ఉద్యానశాఖ అధికారులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే రైతులకు పవర్‌టిల్లర్, మామిడి కాయలకు కట్టే సబ్సిడీ కవర్లను పంపిణీ చేశారు. పలమనేరు నియోజకవర్గంలోని 82 మంది రైతులకు 80 హెక్టార్ల విస్తీర్ణానికి సంబంధించి రూ.కోటి విలువైన సూక్ష్మ సేద్య పరికరాలను, అంతరసేద్యానికి ఉపయోగపడే పవర్ టిల్లర్లను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, శాస్త్రవేత్త పూర్ణదత్తారెడ్డి, కృషి విజ్ఞానకేంద్రం పీర్‌సాహెబ్, సూక్ష్మసేద్య ప్రాజెక్టు అధికారి బాలసుబ్రహ్మణ్యం, సంచాలకులు కోటేశ్వరరావు, పలమనేరు అధికారులు, టీడీపీ నాయకులు బాలాజీ, రామచంద్రనాయుడు, నాగరాజరెడ్డి, జగదీష్‌నాయుడు, కిషోర్‌గౌడు, రంగనాథ్, రాంబాబు, సుబ్రహ్మణ్యంశెట్టి, శ్రీరాములు, ప్రసాద్‌నాయుడు, మురహరిరెడ్డి పాల్గొన్నారు.

దొరస్వామినాయుడి దారి ఆదర్శనీయం



దొరస్వామినాయుడికి నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపల్ కృష్ణారావు తదితరులు

కుప్పం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పీఈఎస్ వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ ఎంఆర్. దొరస్వామినాయుడు చూపిన దారి అందరికీ ఆదర్శనీయమని.. కృషి, పట్టుదలతోనే పీఈఎస్ ప్రఖ్యాత విద్యా సంస్థగా ఎదిగిందని పీఈఎస్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ అండ్ డీన్ డాక్టర్ హెచ్ఆర్ కృష్ణారావు అన్నారు. దొరస్వామినాయుడు స్మారకార్థం పీఈఎస్ వైద్య కళాశాలలో శనివారం సంతాప సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో నాణ్యత, పరిశోధన, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి దొరస్వామి నాయుడు దారి చూపారన్నారు. ఆయన అద్భుత నాయకత్వాన్ని, విద్యాపరమైన సంస్కరణలు, విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధి పట్ల ఆయన అంకిత భావాన్ని గుర్తు చేసుకున్నారు. మౌనం పాటించి దొరస్వామి నాయుడు మృతికి నివాళి అర్పించారు.

పలమనేరు విద్యార్థినికి బహుమతి



మొదటి బహుమతి తీసుకుంటున్న ఇఫ్రాత్ ఫాతిమా

పలమనేరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో జరిగిన జాతీయ విజ్ఞాన దినోత్సవంలో వక్తృత్వ పోటీల్లో పలమనేరు నార్త్ పాఠశాలలో మూడో తరగతి చదువుకుంటున్న విద్యార్థిని ఇఫ్రాత్ ఫాతిమ జిల్లాస్థాయిలో మొదటి బహుమతి సాధించింది. జిల్లా సమగ్ర శిక్ష పథక సంచాలకులు వెంకటరమణ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందజేశారు. శనివారం చిన్నారిని పలమనేరు ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం అభినందించారు.

సింహవాహనంపై శ్రీవారి విహారం



ఊరేగుతున్న ఉత్సవర్లు

సోమల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఆవులపల్లె ప్రసన్న వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ, పూజలు చేపట్టారు. శాస్త్రోక్తంగా గ్రామోత్సవం నిర్వహించారు. సింహవాహనంపై ఉత్సవర్లను అలంకరించి పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. మహిళలు కర్పూర నీరాజనాలతో మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆవులపల్లె, అన్నెమ్మగారిపల్లె, పెద్దఉప్పరపల్లె, పేటూరు పంచాయతీల్లోని క్షత్రియ సంఘం సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. టీటీడీ అధికారులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వైభవోపేతంగా లక్ష్మీ నరసింహుడి బ్రహ్మోత్సవాలు



పల్లకిని వితరణగా అందజేసిన కరుణాకర్‌నాయుడు

కల్లూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు దేవళంపేటలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం ఉదయం బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కల్లూరుకి చెందిన టీడీపీ నాయకులు జొన్నగడ్డల కరుణాకర్‌నాయుడు ఆలయానికి రూ.1.10 లక్షల విలువైన పల్లకిని వితరణగా అందజేశారు. బ్రహ్మోత్సవాల కమిటీ ధనంజయనాయుడు, మురళీధర్‌నాయుడు, యర్రయ్య, అనిల్, రాజేష్, రమేష్, నాగరాజు, పునీత్‌చౌదరి, మునేంద్ర, మురళి పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి టీడీపీ ఆర్థిక సాయం

రామకుప్పం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బల్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కనకప్ప కుమారుడు సుబ్రహ్మణ్యం శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి నాగభూషణం, యూనిట్ ఇన్‌చార్జి రామ్మూర్తి, మాజీ సర్పంచ్ మహాదేవి , జయశంకర్, నేతలు ఎర్రప్ప, మునిరత్నం, శ్రీనివాసులు, చంద్ర తదితరులు సుబ్రహ్మణ్యం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు పార్టీ తరపున రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు.

కట్టెల లారీ బోల్తా



కుప్పం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కుప్పం- కృష్ణగిరి జాతీయ రహదారిపై నడిమూరు సమీపంలోని మలుపులో శనివారం సాయంత్రం నీలగిరి తైలం కర్రల లోడ్‌తో వెళ్తున్న భారీ లారీ బోల్తా పడింది. ఎర్రచందనం దుంగల లోడ్డు అన్న వదంతులు రావడంతో కుప్పం అటవీ శాఖాధికారి జయశంకర్ ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అయితే రాజుపేట రోడ్డు నుంచి తమిళనాడుకు రవాణా అవుతున్న నీలగిరి తైలం కర్రలు మాత్రమే లారీలో ఉన్నట్లు వారి పరిశీలనలో తేలింది. సుమారు 10 టన్నుల లోడ్డుతో వెళ్తున్న లారీ మలుపులో అదుపు తప్పి బోల్తా పడినట్లు ఎఫ్ఆర్‌వో జయశంకర్ తెలిపారు. నీలగిరి తైలం, సుబాబుల్ వంటి కర్రలు, పేపర్ మిల్లులకు తరలడం మామూలేనని ఆయన చెప్పారు.

ఫైనాన్స్ కంపెనీ సిబ్బందిపై దాడి

పుంగనూరు రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీలో తీసుకున్న రుణం చెల్లించాలని అడిగినందుకు సిబ్బందిపై ఓ వ్యక్తి కత్తితో దాడి చేసి గాయపరిచినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుని కథనం మేరకు.. పట్టణంలోని శ్రీరామ్స్ ఫైనాన్స్ కంపెనీలో ఎంసీపల్లె పంచాయతీ కొత్తూరుకు చెందిన వెంకటరెడ్డి కుమారుడు పురుషోత్తం రూ. 90 వేలు ఫైనాన్స్ ఏడు నెలల క్రితం తీసుకున్నాడు. సకాలంలో చెల్లించకపోవడంతో శ్రీరామ్ ఫైనాన్స్ మేనేజర్, షేక్ భరకత్, సిబ్బంది నందీష్, అనంతకుమార్‌లు వెళ్లి డబ్బులు చెల్లించాలని సూచించారు. తాను డబ్బులు చెల్లించనని.. కోర్టులో కేసు వేసుకోవాలని వారిపై వాదనకు దిగడంతో అనంతకుమార్ సెల్‌ఫోన్‌లో రికార్డు చేస్తుండగా వాగ్వాదం జరిగింది. దీంతో ఆగ్రహించిన పురుషోత్తం కత్తితో దాడికి పాల్పడటంతో నందీష్ గాయపడ్డాడు. అతడిని పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

మహిళా శక్తి మహోన్నతం



కుప్పం: నమూనా చెక్కు పంపిణీ చేస్తున్న కడా పీడీ, పీఎస్ఎం తదితరులు



రొంపిచెర్ల : మహిళా సంఘ సభ్యులను సన్మానిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి



కల్లూరు: మహిళలకు బహుమతులందిస్తున్న మహమ్మదలి



రొంపిచెర్ల కేజీబీవీలో...



వి.కోటలో జరిగిన ప్రదర్శనలో సీఐ సోమశేఖర్, విద్యార్థులు



గంగవరం: ఉత్తమ సేవలందిస్తూ సత్కారాలు అందుకున్న మహిళలు



పలమనేరు: మహిళా సంఘాలకు నమూనా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



కుప్పం: డాక్టర్ మోహన రూపను సత్కరిస్తున్న బీసీఎన్ తదితరులు



కుప్పంలోని డీఎస్సీ శిక్షణ శిబిరంలో..



చెక్కునత్తంలో మహిళలకు సన్మానం



పుంగనూరులో మాట్లాడుతున్న ఎంఈవో చంద్రశేఖరరెడ్డి



పలమనేరులో ఆకట్టుకున్న పిల్లల భరతనాట్యం

కుప్పం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆ దిశగా అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలు మహిళల ఎదుగుదలకు, ప్రాధాన్యం పెరగడానికి ఎంతో దోహదం చేస్తున్నాయన్నారు. కుప్పంలోని ఎన్టీఆర్ స్పోర్ట్స్ స్టేడియంలో శనివారం కడా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కుప్పం నియోజకవర్గానికి మిస్ యూనివర్స్ ఏపీ చందన జయరాం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కడా పీడీ వికాస్ మర్మత్ మాట్లాడుతూ కుప్పంలో మహిళలు వివిధ రంగాలలో అభివృద్ధి చెందడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళికలు రూపొందిస్తున్నారని చెప్పారు. కడా మహిళా సాధికారతకు అవసరమైన కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తుందన్నారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్. మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు మాట్లాడుతూ వికసిత్ భారత్ 2047 ప్రణాళిక ప్రకారం ప్రపంచంలో మొదటి మూడు స్థానాల్లో ఆంధ్రప్రదేశ్‌ను నిలపడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందని చెప్పారు. మిస్ యూనివర్స్ ఏపీ చందన జయరాం మాట్లాడుతూ తన తల్లి, అత్త తనకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. మహిళలు ఏదైనా సాధించాలంటే శారీరక, మానసిక దృఢత్వం చాలా అవసరమని పేర్కొన్నారు. సీఈఎస్ఎల్ డెలిగేట్ రీతూ మాట్లాడుతూ కుప్పం అభివృద్ధికి కడా పీడీ చేస్తున్న కృషి చూసి తానూ ఏదో సాయం చేయాలన్న ఆలోచన వచ్చిందన్నారు. అనంతరం మెప్మా ద్వారా బ్యాంకు లింకేజీ కింద రూ.15.42 కోట్ల మెగా చెక్కును మహిళా లబ్ధిదారులకు అందించారు. ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేస్తున్న మహిళా స్వీపర్లను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, వెలుగు ఏపీఎం చంద్రశేఖర్, తహశీల్దారు చిట్టిబాబు, శాంతిపురం మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, గుడుపల్లె మాజీ ఎంపీపీ మునిరాజు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

● కుప్పం: మహిళా శక్తి మహోన్నతమైందని పీఈఎస్ వైద్య కళాశాల అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.మోహన రూప అన్నారు. కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో విమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీసీఎన్ విద్యా సంస్థల అధినేత బీసీ.నాగరాజు మాట్లాడుతూ మహిళా దినోత్సవం ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో కేఈసీ వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సునీల్ రాజ్, ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.బాస్కరన్, ఆర్అండ్‌డి డైరెక్టర్ జీఎన్.కోదండరామయ్య, విమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో ఆర్డినేటర్ వి.సత్యవాణి, జీకే.జ్యోతి, పీఆర్వో ప్రవీణ్ కుమార్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● డీఎస్సీ ఉచిత శిక్షణ శిబిరంలో: ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరుగుతున్న డీఎస్సీ ఉచిత శిక్షణ శిబిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరికి ధన్యవాదాలు తెలిపారు.

● కుప్పం రూరల్‌లో: కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ రైతు సేవా కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సీనియర్ మహిళలను, మహిళా ప్రజా ప్రతినిధులను సన్మానించారు. కార్యక్రమంలో తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి, పంచాయతీ కార్యదర్శి మురళి, నాయకులు మునిరత్నం, తిమ్మప్ప, రాము, వెంకటాచలం, సంఘమిత్రలు కృష్ణప్ప, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

● పలమనేరు : మహిళలు మరింత చైతన్యవంతులుగా రాణించాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో శనివారం మెప్మా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగడానికి నాడు స్వర్గీయ నందమూరి తారక రామారావు బీజం వేశారని తెలిపారు. అనంతరం పట్టణ స్వయం సహాయక సంఘాలకు రూ. 10.58 కోట్ల మెగా చెక్కును అందజేశారు. వివిధ రంగాల్లో రాణించిన మహిళలను ఆయన సన్మానించి అభినందించారు. బాలికలు ప్రదర్శించిన భరతనాట్యం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో సూపర్‌బజార్ అధ్యక్షులు ఆర్వీ బాలాజీ, మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి, మెప్మా మేనేజర్ బాబా కౌన్సిలర్లు సునీత, కిరణ్, బీఆర్‌సీ కుమార్, టీడీపీ నాయకులు నాగరాజు, ఆర్బీసీ కుట్టి, గిరిబాబు, ఖాజాపీర్, చాంద్‌బాషా, మదన్‌మోహన్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

● రొంపిచెర్ల: మహిళా సంఘ సభ్యులు ఆర్థికంగా ఎదగాలనేది ముఖ్యమంత్రి లక్ష్యమని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. అంతర్జాతీ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వివిధ వృత్తుల్లో ప్రతిభ చూపిన సునీత, సభానా, శాంతి, రమాదేవి, అనిత, శిద్దమ్మలను ఆయన శాలువలతో సత్కరించారు.

● పుంగనూరు: మహిళల భాగస్వామ్యంతోనే సమాజంలో అభివృద్ధి జరుగుతుందని ఎంఈవోలు చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌యాదవ్, హరికిషోర్‌రెడ్డి, దీపారాణి, సుమల, సుమిత్ర, పద్మజ, రేవతి, పార్వతమ్మ, రాధిక, సంధ్యారాణి, గాయిత్రి, నాగరత్నమ్మ, గంగులమ్మ, లక్ష్మీదేవి, షహనాజ్‌భాను, శ్రీధర్, సుధాకర్, బుడ్డప్ప, చిరంజీవి పాల్గొన్నారు.

● స్థానిక అంబేడ్కర్ ప్రజాభవన్‌లో దళిత సంఘ నాయకులు, మహిళా ఉపాధ్యాయులు సరస్వతి, నాగలక్ష్మీలను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, మహానంది, జెవీనాగరాజ, రెడ్డెప్పలు పాల్గొన్నారు. బహుజన సంఘ నాయకులు, టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో బహుజన సంఘన నాయకులు కృష్ణమూర్తి, గంగరాజు, శ్రీనివాసులు, టీడీపీ నాయకులు మధుసూదన్‌రాయల్ పాల్గొన్నారు.

● కల్లూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రాజశేఖర్‌బాబు, జిల్లా లయన్స్ క్లబ్ క్రీడావిభాగం అధ్యక్షులు మహమ్మదలి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయం, వీఆర్ఆర్ కళాశాలలో శనివారం మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలకు బహుమతులు అందించారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజు, అధ్యాపకులు, మహిళలు పాల్గొన్నారు.

● వి.కోట: వి.కోటలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులచే మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సర్పంచ్ లక్ష్మీతోపాటు వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సన్మానించారు.

● రొంపిచెర్ల: మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎస్ఐ సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● గంగవరం: మహిళలు సొంతంగా నిర్ణయాలు తీసుకోగలిగినప్పుడే మహిళా సాధికారత సాధించినట్లని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కార్యదర్శి పుష్ప పేర్కొన్నారు. శనివారం స్థానిక కళామందిరంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి, జాయినింగ్ ద డాట్స్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను డాక్టర్ మమతరాణి, సింధూప్రభాకరన్, లత, రామలక్ష్మి, నాగేశ్వరి, కళ, శాంతమ్మ, మంజుల, గజలక్ష్మి, చిట్టెమ్మ, ప్రవీణ, ప్రియాంక, హిమబిందు, కవిత, సరస్వతి, జయలక్ష్మి, లక్ష్మి, నిర్మల, హేమకుమారి, అరుణ, మల్లీశ్వరి, నిర్మలకుమారి, ఉమా, జ్యోతిలకు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఎంఈవో బాలసుందరం, తులసీనాథం నాయుడు, ధనంజయ, రామక్రిష్ణప్ప, జనార్దన్, శ్రీరామచంద్రమూర్తి, చంద్రశేఖరయ్య, మొహిద్దీన్, నరేంద్రబాబు, మాధవి పాల్గొన్నారు.

● పలమనేరు: పలమనేరు ఎస్సీ బాలికల వసతి గృహంలో వంట చేస్తున్న సరమ్మను శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.

చిన్నశేషవాహనంపై శ్రీవారి దివ్యతేజం



చిన్నశేషవాహనంపై ఊరేగిన శ్రీవారు

పుంగనూరు రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణస్వామి చిన్నశేషవాహనంపై శనివారం పట్టణ పురవీధుల్లో ఊరేగారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం హంసవాహనంపై స్వామివారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అంగన్వాడీ సూపర్‌వైజరుగా శిరీష



రొంపిచెర్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టులో పనిచేస్తున్న రొంపిచెర్ల మండల సూపర్‌వైజర్ డి.శిరీష, రొంపిచెర్ల వన్ అంగన్వాడీ హెల్పర్ కమ్మర్నాజ్ సేవలకు కలెక్టర్ నుంచి ఉత్తమ అవార్డులు అందుకున్నారు. శనివారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో అవార్డులు అందుకున్నట్లు సీడీపీవో మల్లీశ్వరి తెలిపారు.

కేజీబీవీ విద్యార్థినికి కలెక్టర్ అభినందన

గంగవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి టైక్వాండో పోటీలలో పాల్గొన్న గంగవరం కేజీబీవీలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని చందనకు కలెక్టర్ సుమిత్‌కుమార్ జ్ఞాపికను అందించి అభినందించారు. శనివారం చిత్తూరులో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో చందనను అభినందించారు. 2024-2025 విద్యా సంవత్సరంలో జాతీయ స్థాయి టైక్వాండో పోటీలకు హాజరై హోరాహోరీగా తలపడి సెమీస్‌లో వెనుదిరిగింది. జ్ఞాపికను అందుకున్న చందనను కేజీబీవీ ఎస్‌వో రోహిణి, పీఈటీ తరుణమ్‌తాజ్, సీఆర్‌టీలు అభినందించారు.

లోక్ అదాలత్‌లో 428 కేసుల పరిష్కారం



పలమనేరులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ



పుంగనూరులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఆరీఫా

పలమనేరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పలమనేరు కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్‌లో 428 కేసులు పరిష్కరించారు. అనంతరం జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ మాట్లాడుతూ కూతురిగా, అక్కగా, చెల్లిగా, గృహిణిగా, తల్లిగా ఇంటి బాధ్యతలను అత్యంత సమర్థవంతంగా మహిళ నిర్వహిస్తోందన్నారు. జూనియర్ సివిల్ జడ్జి లిఖిత, చిత్తూరు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మీపతి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, బ్యాంకు అధికారులు, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

పుంగనూరులో 208 కేసులకు..

● పుంగనూరు రూరల్, : పుంగనూరు కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 208 కేసులు పరిష్కారమైనట్లు సీనియర్ సివిల్ జడ్జి ఆరీఫా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కక్షదారులు లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడంతో డబ్బు ఆదాతో పాటు సమయం కలిసి వస్తుందన్నారు. కోర్టు కేసులు ఉండటంతో కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి వంశీకృష్ణ, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు చెన్నకేశవులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ



అంకురార్పణకు పుట్ట మట్టి తీసుకొస్తున్న వేదపండితులు

చౌడేపల్లె, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక బజారు వీధిలో వెలసిన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన శనివారం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. వేదపండితులు ఆధ్వర్యంలో గ్రామదేవత చౌడేశ్వరీదేవి ఆలయం సమీపం నుంచి వేదపండితులు మంగళ వాయిద్యాల నడుమ పుట్టమట్టి తీసుకొచ్చి నవధాన్యాలు వేసి కలశాలను ఏర్పాటు చేశారు.

పోలీసు స్టేషన్‌కు మాజీ ఎమ్మెల్యే హాజరు

పలమనేరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పలమనేరు పోలీసు స్టేషన్‌కు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ శనివారం హాజరయ్యారు. ఎన్నికల అనంతరం ఆయనపై నమోదైన కేసుకు సంబంధించి కండీషన్ బెయిల్‌లో భాగంగా ఆయన పోలీసు స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేసి వెళ్లారు. ఆయన వెంట పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఫీజుపోరు పోస్టర్ల ఆవిష్కరణ

పలమనేరు, మార్చి8 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో ఈనెల 12న చేపడుతున్న ఫీజుపోరు పోస్టర్లను మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ వైసీపీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు.

అక్రమ మద్యం స్వాధీనం.. మహిళ అరెస్టు

రామకుప్పం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బందార్లపల్లె పంచాయతీ ఎద్దులగట్టు గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలకు పాల్పడుతున్న లక్ష్మిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకటమోహన్ తెలిపారు. ఆమె నుంచి 35 మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు.

నీలగిరి తోట దగ్ధం



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పుంగనూరు రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని షుగర్ ఫ్యాక్టరీ రోడ్డులోని బైనిగానిపల్లె నారాయణరెడ్డి నీలగిరి తోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని అగ్నిమాపక అధికారి సుబ్బరాజు తెలిపారు. శనివారం మధ్యాహ్నం తోటలో మంట లు రావడం గమనించిన పశువుల కారుపరులు అగ్నిమాకశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

ఆడవాళ్లను గౌరవించడం మన సంప్రదాయం

ఎమ్మెల్యే భానుప్రకాష్



కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఆడవాళ్లను గౌరవించడం మన సంప్రదాయమని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. నగరి డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం జరిగిన మహిళా దినోత్సవంలో ఆయన ప్రసంగించారు. ఎన్టీఆర్.. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించారని గుర్తుచేశారు. అలాగే మహిళల కోసం డ్వాక్రా వ్యవస్థను ప్రవేశపెట్టిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందన్నారు. నియోజకవర్గంలోని మహిళలకు తాను రుణపడి ఉంటానని చెప్పారు. ఐసీడీఎస్ సీడీపీవో కృష్ణవేణి, ఎంఈవో శ్రీదేవి, నాయకులు రమేష్‌బాబు, రవినాయుడు, శివకుమార్‌రెడ్డి, బాలాజి, మీరా, మెరుపుల మహేష్, అంగన్వాడీ కార్యకర్తలు, మెప్మా సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. ● నగరి వైసీపీ, సీపీఐ కార్యాలయంలోనూ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

చిత్తూరు సిటీ: జిల్లా టీడీపీ కార్యాలయంలో తెలుగు మహిళలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. జీజేఎం చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ గురజాల చెన్నకేశవ నాయుడు, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, మేయర్ అముద, చిత్తూరు పార్లమెంటు తెలుగు మహిళ అధ్యక్షురాలు కార్జాల అరుణ, ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న, నేతలు వరలక్ష్మి, రాణి, నాగలక్ష్మి, శ్రీదుర్గ తదితరులు పాల్గొన్నారు. ● బృందావన్ సీనియర్ సెంకడరీ పాఠశాలలో జరిగిన సంబరాల్లో వ్యవస్థాపకులు శైలజ కుమారి, ప్రియ తేజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బృందావన్ పాఠశాలలో సంబరాలు

చిత్తూరు రూరల్: చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో జరిగిన వేడుకల్లో ప్రతిభ చూపిన మహిళా కండక్టర్లకు ప్రశంసా పత్రాలను ఎమ్మెల్యే తండ్రి, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ చెన్నకేశవులు నాయుడు ప్రదానం చేశారు. ఎమ్మెల్యే తల్లి రజినమ్మ, 1, 2 డిపో మేనేజర్లు కృష్ణమూర్తి, రూపశ్రీ, ఏడీఎం అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.



మహిళా కండక్టర్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న చెన్నకేశవులు నాయుడు

స్త్రీలు అన్ని రంగాల్లో రాణించాలి

మహిళా దినోత్సవంలో వక్తల పిలుపు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): స్త్రీలు అన్ని రంగాల్లో రాణించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. చిత్తూరులోని రెవెన్యూ భవన్‌లో ఏపీ జేఏసీ అమరావతి చిత్తూరు జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఛైర్‌పర్సన్ జయంతి, కార్యదర్శి లత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డు తహసీల్దార్ మోహనవల్లిని సన్మానించారు. ఎన్జీవో భవనంలో జరిగిన వేడుకల్లో ఏఈఈ ధనలక్ష్మి, పుంగనూరు డిగ్రీ కాలేజీ లెక్చరర్ స్రవంతి, యోగా టీచర్ కృష్ణవేణి, ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవులు, కార్యదర్శి రఘు, చిత్తూరు యూనిట్ అధ్యక్షుడు భానుప్రకాష్, ఉపాధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పూతలపట్టు: మండలంలోని పి.కొత్తకోట సమీపంలో ఉన్న వేము ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన వేడుకల్లో రైల్వే డీఎస్పీ హర్షిత, కళాశాల ఛైర్మన్ చంద్రశేఖర్ నాయుడు, ప్రిన్సిపాల్ నవీన్ కిలారి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



వేము కళాశాలలో జరిగిన వేడుకల్లో రైల్వే డీఎస్పీ హర్షిత

వెదురుకుప్పం: కార్వేటినగరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. అంగన్వాడీ ఉద్యోగులకు, వర్కర్లకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను ప్రదానం చేశారు. ఎంపీపీ లత, ఐసీడీఎస్ సీడీపీవో పద్మసునంద పాల్గొన్నారు. ● కార్వేటినగరం వెలుగు కార్యాలయంలో ఏపీఎం కవిత కేక్ కట్ చేశారు. వివిధ సంఘాల లీడర్లు, సభ్యులు, సీసీలు హాజరయ్యారు. ● వెదురుకుప్పం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ నాగరాణి కేక్ కట్ చేశారు. ఎంపీడీవో అమరనాథ్, వైస్‌ఎంపీపీ బట్టే రమణసుబ్రహ్మణ్యం, ఉప తహసీల్దార్ కోమల, పరిపాలనాధికారి నాగరాణి, ఏవో వనిత, ఏపీవో ఇందు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శకుంతల, ఎంఈవో దామోదరం, జడ్పీటీసీ సభ్యుడు చలంపాళ్యం సుకుమార్ హాజరయ్యారు.



అంగన్వాడీ వర్కర్ మమతకు జ్ఞాపికను అందజేస్తున్న ఎంపీపీ లత, సీడీపీవో పద్మసునంద

శ్రీరంగరాజపురం: ఆరిమాకుపల్లె పీహెచ్‌సీలో మహిళ వైద్య సిబ్బందిని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కోశాధికారి పైనేని మురళి సన్మానించారు. కమిటీ సభ్యులు చాణక్య, సురేష్, దాము నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీ సిబ్బందిని సన్మానించిన పైనేని మురళి

ఐరాల(కాణిపాకం): కాణిపాకం జడ్పీహైస్కూల్‌లో, వరసిద్ధుడి ఆలయ ఈవో కార్యాలయంలో, రీడ్స్, హీరో సంస్థల ఆధ్వర్యంలో మహిళలను సన్మానించారు. ఐరాల ఎంపీడీవో ధనలక్ష్మి, ఏపీజీపీ జిల్లా విభాగం అధ్యక్షురాలు భాగ్యమేరి, సెయింట్ స్టీఫెన్ స్కూల్ కరస్పాండెంట్ ఉషాకిరణ్, ఈవో పెంచలకిషోర్, ఈఈ వెంకటనారాయణ, ఏపీజీపీ జిల్లా అధ్యక్షుడు శివయ్య తదితరులు పాల్గొన్నారు.



జడ్పీ హైస్కూల్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో ధనలక్ష్మి

చిత్తూరు రూరల్: నగరానికి చెందిన కీర్తి ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్‌పై శిక్షణ తీసుకుంటున్న మహిళలను అధ్యక్షురాలు రాణి యాదవ్ సత్కరించారు. జ్యోతిలక్ష్మి, విక్టోరియా, వాసుకి, నవనీత, నీలావతి పాల్గొన్నారు. ● జిల్లా గ్రంథాలయ సంస్థలో పనిచేస్తున్న మహిళా అధికారులు, సిబ్బందిని సంస్థ కార్యదర్శి శర్మ, అధికారులు సత్కరించారు. లైబ్రేరియన్లు గజేంద్ర బాబు, మనీంద్ర, గుణశేఖర్, బిలాల్ తదితరులు పాల్గొన్నారు. ● విద్యుత్ శాఖ గెస్ట్‌హౌస్‌లో జరిగిన వేడుకల్లో మహిళా ఉద్యోగులను ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ సతీమణి ఎస్కే మల్లిక సత్కరించారు. ఎస్‌ఈతోపాటు ఈఈ మునిచంద్ర, డీఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న విద్యుత్ శాఖ ఉద్యోగినులు



డిప్యూటీ లైబ్రేరియన్ లలితకు సత్కారం

చిత్తూరు కల్చరల్: పి.కొత్తూరులోని నాగ లింగేశ్వర స్వామి ఆలయంలో సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు 60 మంది పేద మహిళలకు బియ్యం, పప్పులు, చింతపండు, నూనెలు, పంచదార తదితరాలను వితరణ చేశారు. అనంతరం గ్రామంలోని చిన్నారులతో కలిసి నగర సంకీర్తన నిర్వహించారు. సేవాసమితి జిల్లా అధ్యక్షుడు మధుసూదనం, ప్రొఫెసర్ భానుప్రకాష్, ప్రభాకర్‌నాయుడు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: గ్రేడ్స్ సంస్థ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో నెహ్రూ యువకేంద్రం (చిత్తూరు)తో కలిసి పలు రంగాల్లోని మహిళలను సన్మానించారు. గ్రేడ్స్ సంస్థ శేషాద్రి, సర్పంచ్ ఉమాదేవి, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.



మహిళలను సన్మానించిన గ్రేడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

సంక్షిప్తంగా..

నేడు మహాకుంభాభిషేకం

పాలసముద్రం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): బలిజకండ్రిగలో నిర్మించిన ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయంలో ఆదివారం ఉదయం 8.30 గంటలకు మహాకుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ధర్మకర్త టి.మురళి తెలిపారు. శనివారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో గణపతి, నవగ్రహ, మహాలక్ష్మీ హోమాలు నిర్వహించారు. మొదటికాల యాగశాల పూజ చేశాక ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు.

వన వేణుగోపాలుడికి ప్రత్యేక పూజలు



వెదురుకుప్పం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాలస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాల భక్తులు అక్కడి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ప్రధాన కార్యనిర్వాహకుడు శివకుమార్ పర్యవేక్షించారు.

రేపటినుంచి అభిషేక పండుగలు

వెదురుకుప్పం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో సోమవారం నుంచి మూడ్రోజులపాటు అభిషేక పండుగలు జరుగుతాయని బేతేల్ షారోన్ చర్చి పాస్టర్ ఆశీర్వాదం శనివారం తెలిపారు. విశ్వాసకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.


విద్యార్థులకు అభినందన



ప్రశంసాపత్రం అందుకుంటున్న కమల్ విజయ

పాలసముద్రం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నేషనల్ సైన్స్ డే కార్యక్రమంలో భాగంగా శనివారం చిత్తూరులో జరిగిన పోటీల్లో తిరుమలరాజుపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు కమల్ విజయ, తేజ్‌వర్మ ప్రతిభ చూపి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం సుధాకర్, సైన్స్ ఉపాధ్యాయుడు మురగదాస్ అభినందించారు.

ఆర్థిక సాయం



గ్రామస్తులకు చెక్కును అందిస్తున్న వంశీ చౌదరి

బంగారుపాళ్యం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు టీడీపీ వాణిజ్య విభాగ మండల అధ్యక్షుడు బాష్యం వంశీ చౌదరి రూ.10 వేల ఆర్థికసాయం చేశారు. గుంతూరు దళితవాడలో రాజ్యాంగ నిర్మాత విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

రోడ్లపై వారపు సంతలతో ట్రాఫిక్ కష్టాలు: ఎంపీపీ

వెదురుకుప్పం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): 'వెదురుకుప్పం, పచ్చికాపల్లం వారపు సంతలు రోడ్లపై నిర్వహించడం వల్ల జనానికి ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ఒక్కోసారి 108 అంబులెన్స్ వాహనానికి కూడా దారి ఉండటం లేదు' అని వెదురుకుప్పం ఎంపీపీ నాగరాణి తెలిపారు. శనివారం వెదురుకుప్పం ఎంపీడీవో సమావేశపు మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. జడ్పీటీసీ చలంపాళ్యం సుకుమార్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనులను సర్పంచులు, ఎంపీటీసీల దృష్టికి కూడా తేవాలన్నారు. కేవలం పంచాయతీ తీర్మానాల కోసం మాత్రమే అధికారులు వస్తున్నారని చెప్పడంతో గంటావారిపల్లె సర్పంచ్ శ్రీనాథరెడ్డి, కురివికుప్పం గ్రామ సర్పంచ్ అబ్బుల్‌రెడ్డి కలుగజేసుకున్నారు. గతంలో కూడా ఇలానే జరిగిందనడంతో కొంతసేపు సభ రసాభాసగా మారింది. ఉపాధి పనులకు వెళ్లి గాయపడిన, మృతి చెందినా పట్టించుకోవడం లేదని ఏపీఎం ఇందు పనితీరుపై దేవరగుడిపల్లె సర్పంచ్ ఆశీర్వాదం మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం రూ.5లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు చేయించి రూపాయి కూడా ఇవ్వలేదని మారేపల్లె సర్పంచ్ అన్నురాశి సభ దృష్టికి తీసుకొచ్చారు. వైస్ ఎంపీపీ బట్టే రమణసుబ్రహ్మణ్యం, కో-ఆప్షన్ మెంబరు పి.వెంకటేశులు, ఎంపీడీవో అమరనాథ్, పరిపాలనాధికారి నాగరాణి, ఏవో వనిత, ఏపీఎం పరశురాంరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గాయత్రి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శకుంతల, ఈవోపీఆర్డీ పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.



వెదురుకుప్పం మండల సర్వసభ్య సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ నాగరాణి

14న జనసేన ఆవిర్భావ దినోత్సవం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన యుగంధర్ తదితరులు

శ్రీరంగరాజపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని గంగాధర నెల్లూరు జనసేన ఇన్‌చార్జి యుగంధర్ పిలుపునిచ్చారు. శనివారం పుల్లూరు క్రాస్ రోడ్డులో సాయిబాబా మందిరంలో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 14వ తేదీన పిఠాపురంలో జరగనున్న కార్యక్రమంలో నియోజకవర్గంలోని జనసైనికులు పాల్గొనాలని కోరారు. మండల అధ్యక్షుడు చిరంజీవి, ఉపాధ్యక్షుడు చందు, చార్లిస్, శ్రీనివాసులు, సోము, జాఫర్, ఖాదర్, రాఘవ, వెంకటేష్, అనామల్లై, తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



వంతెనపై ఏర్పడిన గొయ్యి

పాలసముద్రం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు-బలిజకండ్రిగ ఆర్‌అండ్‌బీ రోడ్డు కోనకాలువ వద్ద ఉన్న వంతెనపై పెద్ద గొయ్యి ఏర్పడింది. రెండేళ్ల కిందట కురిసిన భారీ వర్షాలకు ఈ గొయ్యి పడింది. అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులే ఇక్కడ నల్లరాళ్లు వేసి మట్టి వేసి.. పూడ్చారు. గత ఏడాది డిసెంబరులో కురిసిన భారీ వర్షాలకు వంతెనపై నీళ్లు ప్రవహించడంతో మట్టి, రాళ్లు కొట్టుకుని పోయి గొయ్యి మరింత పెద్దదిగా మారింది. ఇక్కడ గొయ్యి ఉందని తెలియని ఎంతోమంది ద్విచక్రవాహదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు వంతెనకు మరమ్మతులకు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీసు స్టేషన్‌లో మాజీ ఎమ్మెల్యే సంతకం

పలమనేరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పలమనేరు పోలీసు స్టేషన్‌కు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ శనివారం హాజరయ్యారు. ఎన్నికల అనంతరం ఆయనపై నమోదైన కేసుకు సంబంధించి కండీషన్ బెయిల్‌లో భాగంగా పోలీసు స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేసి వెళ్లారు. ఆయన వెంట వైసీపీ నేతలు ఉన్నారు.

13న రొంపిచెర్ల వారపుసంత వేలం

రొంపిచెర్ల మార్చి 8 (ఆంధ్రజ్యోతి) రొంపిచెర్ల మేజర్ పంచాయతీ కార్యాలయంలో ఈనెల 13 వతేది గురువారం ఉదయం 11 గంటలకు వారపు సంత వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ ఆర్. ఇబ్రహీంఖాన్ తెలిపారు.

జల్లికట్టుకు అనుమతి లేదు: సీఐ

పెనుమూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలంలో జల్లికట్టు నిర్వహించడానికి అనుమతి లేదని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అనుమతి లేకుండా గ్రామాల్లో ఎద్దులపోటీలు, కోడిపందేలు వంటివి నిర్వహించరాదని చెప్పారు. అలా నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు చేపడతామని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారన్నారు.

110 మద్యం బాటిళ్ల స్వాధీనం: ముగ్గురి అరెస్టు



బంగారుపాళ్యం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో 110 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేశారు. సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. బంగారుపాళ్యం మండలంలోని పలు చోట్ల మన రాష్ట్రానికి చెందిన మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు చేశారు. బలిజపల్లెకు చెందిన జి.వేమన్న తన ఇంటి వద్ద మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే తుంబకుప్పం గ్రామానికి చెందిన ఎస్.మునిరత్నం రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 50 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. విరూపాక్షపురానికి చెందిన వి.గోపిని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 30 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ముగ్గురిపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ వైర్ల చోరీ

తవణంపల్లె, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): టి.పుత్తూరు పంచాయతీ కొత్త గోనెపల్లెలోని వ్యవసాయ పొలాల్లోని బోర్లకున్న విద్యుత్ వైర్లను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ మేరకు బాధిత రైతులు సిద్ధయ్య, శ్రీనువాసులురెడ్డి, గోపీనాథ్, దేవరాజులు, మోహన్‌రెడ్డిలు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

ఎల్లసముద్రం రోడ్డుకు మోక్షమెప్పుడు?



నిర్మాణం పూర్తి కాని రహదారి

విజయపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి రోడ్డు నుంచి ఎల్లసముద్రం వరకు రహదారికి మోక్షం లేదా అంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంటు బ్యాంకు వారి ఆర్థిక సహకారం రూ.40 నిధులతో 0.62 కిలోమీటరు రోడ్డును నాలుగేళ్ల కిందట ప్రారంభించి.. కంకరకూడా పరిచారు. కానీ ఏళ్లు గడుస్తున్నా.. రోడ్డు నిర్మాణం మాత్రం పూర్తి కాలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఈ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దాం

కార్వేటినగరం మండల సమావేశంలో ఎంపీపీ లత

వెదురుకుప్పం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దామని కార్వేటినగరం ఎంపీపీ లత పిలుపునిచ్చారు. శనివారం కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ ప్రణాళికలను యంత్రాంగం రూపొందిస్తే తాము కూడా సహకరిస్తామని చెప్పారు. వేసవికాలంతో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేపీఅగ్రహారం సర్పంచ్ కామసాని శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. జాండ్లపేట, వెదురుకుప్పం మీదుగా పచ్చికాపల్లం బస్సు సర్వీసు సరిగా రావడం రాక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. రెవెన్యూ పనితీరు సరిగాలేదని ఆర్కేవీబీపేట సర్పంచ్ దివ్య తెలిపారు. సమావేశానికి డుమ్మా కొట్టే అధికారులపై చర్యల నిమిత్తం కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామని ఎంపీడీవో చంద్రమౌళి హెచ్చరించారు. కత్తెరపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి భద్రతలేకుండా పోయిందని అధికారులు స్పందించాలని డాక్టర్ భువనేశ్వరి కోరారు. మండల వ్యవసాయాధికారి హేమలత మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉందన్నారు. కత్తెరపల్లె, డీఎంపురం రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ లత

లోక్ అదాలత్‌లో 184 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి గోపాలకృష్ణ

నగరి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నగరి జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం న్యాయమూర్తి గోపాలకృష్ణ అధ్యక్షతన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాలకు చెందిన 184 కేసులను పరిష్కరించారు. వీటిలో ఆరు సివిల్, 39 క్రిమినల్, ఒక డీవీసీ, ఏడు ఎంసీ, 9బ్యాంకు, 122 ఎస్టీసీ సెకండ్‌క్లాస్ కేసులు ఉన్నాయి. వీటి పరిష్కారం ద్వారా కక్షిదారులకు రూ.86.79 లక్షల పరిహారం లభించినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు.

వరసిద్ధుడి సేవలో పురందేశ్వరి

ఐరాల (కాణిపాకం), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి శనివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆమెను ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి.. స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి, నాయకులు పాల్గొన్నారు.



పురందేశ్వరికి జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

కుంభాభిషేకానికి అంకురార్పణ

నిండ్ర, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రసన్న వినాయక ఆలయంలో కుంభాభిషేకం పురస్కరించుకుని అంకురార్పణ కార్యక్రమాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం మహాసంకల్పం, కలశ ప్రదర్శన, మహాకుంభాభిషేకం మంత్రపుష్పం, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



యాగశాలలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

టైలరింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం



చిత్తూరు కలెక్టరేట్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు టైలరింగ్‌లో శిక్షణతోపాటు మెషిన్‌ను మంజూరు చేస్తామని చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత అన్నారు. శనివారం చిత్తూరుజిల్లా మహిళా సమాఖ్య కార్యాలయ ప్రాంగణంలో శిక్షణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ అముద మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులకు లోబడి బీసీ, కమ్మ, రెడ్డి, కాపు, ఈబీసీ, క్షత్రియ్య, ఆర్యవైశ్య, బ్రాహ్మణ సామాజిక వర్గాల్లోని మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కమిషనర్ నరసింహప్రసాద్, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, టీడీపీ నేతలు చెన్నకేశవులు, వైవీ రాజేశ్వరి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని మేయర్ అముద, నగర కమిషనర్ నరసింహ ప్రసాద్ అన్నారు. శనివారం లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో 'ప్రజాదర్బార్' నిర్వహించారు. బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలినవి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని అర్జీదారులకు చెప్పారు. మొత్తం 24 అర్జీలు అందాయి.



బాధితుడి నుంచి అర్జీ స్వీకరిస్తున్న మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్